రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్
- పట్టించుకోని పోలీసు సిబ్బంది



ఆలేరు ఎస్‌బీఐ ఎదురుగా రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు



ఆలేరు హైస్కూల్ ఎదురుగా రోడ్డుపై నిలిపిన జేసీబీలు

ఆలేరురూరల్ : రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు స్థానికులకు, ప్రయాణికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలేరు పట్టణంలోని ప్రధాన రహదారిపై పలు కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, ఇతర ప్రాంతాలలో వాహనాలను ఇష్టం వచ్చినట్లుగా నిలుపుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా సంబంధిత పోలీసులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో సామాన్య వాహనదారులు, ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద..

మున్సిపాలిటీలోని పాలకేంద్రం నుంచి దుర్గమ్మ గుడి వరకు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ దుకాణాల ఎదుట వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రయాణాలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. బ్యాంక్ కోసం వచ్చే ఖాతాదారులు బ్యాంక్ ఎదురుగా రోడ్డుపైనే ఇష్టం వచ్చినట్లు వాహనాలు నిలపడంతో బస్సులు, ద్విచక్ర, ఇతర వాహనాలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వేగేట్ చౌరస్తాలో.. బస్టాండ్ ముందు.. రోడ్ల పక్కన వాహనాలు నిలుపుతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట వాహనాలు, జేసీబీలు రోడ్డు సగం భాగాన్ని ఆక్రమిస్తూ నిలపడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. హైదరాబాద్, వరంగల్ వైపులకు వెళ్లే వాహనాలు ప్రయాణాలు సాగేందుకు అవస్థలు పడుతున్నారు. ఎంతసేపు పోలీసులు చలానాలు వసూలు చేయడం, తూతూ మంత్రంగా ట్రాఫిక్‌ను నియంత్రించడం వంటి పనులతో ముగించేస్తున్నారు. జాతీయ ప్రధాన రహదారిపై ఇష్టం వచ్చినట్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ అక్రమ పార్కింగ్‌లపై చర్యలు తీసుకుంటే సమస్యలు తలెత్తవనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఉన్నతాధికారులు రోడ్లపై చేసే పార్కింగ్‌లపై కఠినంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు



ఆలేరు పట్టణంలోని ప్రధాన రోడ్లపైన వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి. రోడ్లపైన పార్కింగ్ చేస్తే భారీ జరిమానాలు విధించి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తాం. రోడ్లపైన వాహనాలను నిలపకుండా తగుచర్యలు తీసుకుంటాం

– కొండల్‌రావు, ఆలేరురూరల్ సీఐ

క్లుప్తంగా

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సైదులు

గుండాల : మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్‌నేరాలపై ఎస్‌ఐ జి.సైదులు బుధవారం అవగాహన కల్పించారు. గ్రామాలలో యువకులు మత్తు పదార్థాలు వదిలి జీవనోపాధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం సైబర్ మోసగాళ్ల తీరుపై వివరించారు. కార్యక్రమంలో పీసీలు సైదులు, నరేష్ తదితరులున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

గుండాల : రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ నేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి మద్దెపురం రాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు పోతరబోయిన సత్యనారాయణ, బత్తిని భిక్షం, ఎండీ.ఖలీల్ తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్లలో భావిల ఎల్లమ్మ ఆలయం పునర్నిర్మాణం కోసం గ్రామస్తులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. కాకతీయుల కాలం నాటి ఆలయమైన శ్రీఎల్లమ్మ తల్లి ఆలయం భావిలో వెలసినట్లుగా ఉండటంతో భావిల ఎల్లమ్మ ఆలయంగా పిలుస్తుంటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, గ్రామస్తులు ఎర్కల స్వామి, కూరెళ్ల రమేష్, బాలాజీ, ఉప్పల నర్సింహ, శ్రీను పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ



నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్యదర్శి

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పీపల్‌పహాడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దివీస్ పరిశ్రమ యాజమాన్యం బుధవారం ఉచితంగా నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిల్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి బి.గీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, సాగర్, ఎస్‌ఎంసీ చైర్మన్ అనిత, దివిస్ ప్రతినిధి ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న గ్రామస్తులు

భువనగిరి రూరల్ : మండలంలోని నందనం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఆ గ్రామస్తులు శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ మారుతిప్రసాద్, నగేల్లి రమేష్‌గౌడ్, నాగెల్లి సత్యనారాయణ, మొలుగు లక్ష్మయ్య, వీరస్వామి, మట్ట అంజయ్య, చంద్రమౌళి, ఎంపల్ల వీరస్వామి, నిమ్మల భిక్షపతి, యాట వెంకటేశం, గణేష్ పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి

భువనగిరిటౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్ దాదాపు రూ.8వేల కోట్ల పైచిలుకు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని, విద్యావ్యవస్థ సక్రమంగా నడవడానికి వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు

భువనగిరి : గణేష్ ఉత్సవాలను పండుగ వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని వరసిద్ధి వినాయక దేవాలయం వద్ద గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అధికారులు సూచించే నిబంధనలు పాటిస్తూ మట్టి విగ్రహాల ఏర్పాటు కోసం ప్రయత్నం చేసి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ సమితి నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రత్నపురం శ్రీశైలం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, ఉత్సవ సమితి గౌరవ సలహాదారు శ్రీనివాస్‌గౌడ్, దేవరకొండ నర్సింహాచారి పాల్గొన్నారు.

ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకే మార్గదర్శకాలు

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

చౌటుప్పల్ : ఆర్థికభారాన్ని తగ్గించుకునేందుకే రైతు రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించినట్లు అనిపిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. తక్షణమే మార్గదర్శకాలను సవరించి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ కొందరికే పరిమితం చేయడంతో ప్రజాగ్రహానికి గురై అధికారం కోల్పోయిందన్నారు. రైతులను అయోమయానికి గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తులు, పరిశీలనలు, షరతులు వంటివి ఏమీ లేకుండా పంట రుణాలు పొందిన రైతులందరికీ రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, మోహన్‌రెడ్డి, సంజీవ, రామలింగం, వెంకటేశం, సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

ఆలేరురూరల్ : అర్హులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చిన్నచిన్న కారణాలు చూపుతూ రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. హామీలు అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. ఎలాంటి కొర్రీలు లేకుండా రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరుశరాములు, కనకయ్య, రవి, ఆంజనేయులు, అంజయ్య, జానమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయుడు

రాజాపేట : మండలంలోని పాముకుంట ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో అందించిన ప్లేట్లు, గ్లాసులను బుధవారం పంపిణీ చేశారు. భువనగిరికి చెందిన ఎన్‌ఆర్‌ఐ డోగిపర్తి శ్రీహరి, జిల్లెల్ల వెంకట్‌రెడ్డి సహకారంతో 200మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేసినట్లు, దాతలతో పాటు ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయుడు ప్రదీప్‌కన్నాకు పాఠశాల హెచ్‌ఎం చంద రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ చిక్క రమాదేవి, ఉపాధ్యాయులు గౌటె బాలరాజు, విజయలక్ష్మి, వి.రమాదేవి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

గుండాల : ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ కాని రైతుల వివరాలను పక్కాగా యాప్‌లో నమోదు చేయాలని ఆలేరు ఏడీఏ పి.పద్మావతి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఈఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం 2024లో రుణం మాఫీ కాని రైతుల సమాచారాన్ని గ్రామాల వారీగా సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. గురువారం నుంచి వచ్చే నెల 9వతేదీ వరకు రేషన్‌కార్డులు లేని రైతుల కుటుంబ సభ్యుల వివరాలను నిర్ధారణ చేసి పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుండాల నోడల్ ఆఫీసర్ సుజాత, ఏఈఓలు ఉన్నారు.

బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్లలో గ్రామంలో బుధవారం భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయిని నర్సింహరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజకులకు రుణాలు మంజూరు చేయాలి

బొమ్మలరామారం : రజక కులస్తులకు రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తూంకుంట గ్రామంలో బుధవారం నిర్వహించిన రజక వృత్తిదారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అన్ని రంగాలలో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, బాలకృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు, భూములు, నగేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పలివెల మీదుగా వెళ్లే బస్సు సర్వీసు రద్దు

మునుగోడు: కొన్నేళ్లుగా మునుగోడు మండలం పలివెల గ్రామం మీదుగా ప్రతి రోజు హైదరబాద్‌కు వెళ్లే బస్సు సర్వీసును బుధవారం ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. నిత్యం ఉదయం 8:30 గంటలకు నల్లగొండ డిపో నుంచి బయలదేరే ఆ బస్సు మునుగోడు మీదుగా కచలాపురం, పలివెల, కోతులారం, యాదాద్రి భువనగిరి జిల్లా మల్లారెడ్డి గూడెం, సర్వేల్ నుంచి హైదరబాద్‌కు వెళ్లేది. తిరిగి మధ్యాహ్న సమయంలో అదే గ్రామాల మీదుగా నల్లగొండకు, సాయంత్రం సమయంలో పలివెల మీదుగా చౌటుప్పల్‌కు వెళ్లి తిరిగి రాత్రి నల్లగొండకు చేరుకునేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం ఆ బస్సులో ప్రయాణిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకునేవారు.

పగులుతున్న బస్సు అద్దాలు

బస్సు సర్వీసు నడిచే రోడ్డు పలివెల గ్రామ శివారు నుంచి మల్లారెడ్డిగూడెం వరకు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా కంపచెట్లు పెరిగాయి. బస్సు వెళ్తున్నప్పుడు కంప మండలు బస్సు అద్దాలకు తగిలి పగిలిపోతుండడమే కాకుండా అందులోని ప్రయాణికులకు గాయాలవుతున్నాయి. ఆ చెట్లను తొలగించాలని ఆర్టీసీ అధికారులు ఆయా గ్రామాల పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. దీంతో బస్సు సర్వీసును రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ నల్లగొండ డిపో మేనేజర్ ప్రకటించారు. ఆ బస్సుపై ఆధారపడిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మోత్కూర్ ఎస్‌ఐ బదిలీ

మోత్కూరు : మండల ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బాలాపూర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగరాజు బదిలీపై మోత్కూర్‌కు రానున్నారు.

ఆర్థికసాయం అందజేత



భూదాన్‌పోచంపల్లి : స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి జెడ్పీ పాఠశాలలో 2005–06లో పదోతరగతి పూర్తి చేసుకున్న పాలకూర్ల నరేష్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. దీంతో బుధవారం అతడి పూర్వ విద్యార్థులు తమవంతుగా విరాళాలు వేసుకొని నరేష్ కుమార్తె పేరున రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అందెల మహేశ్‌యాదవ్, మద్ది శ్రవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన మందుగుల లక్ష్మయ్య ఇటీవల బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం అతడి స్నేహితులు రూ.15వేల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చిలువేరు అంజయ్య, దేశగోని కృష్ణ, ఉప్పల శ్రీనివాస్, జక్కడి వెంకట్‌రెడ్డి, గోపి, నారాయణ, కిరణ్‌కుమార్, వెంకటయ్య, యూసఫ్, గ్రామస్తులు తదితరులున్నారు.

వలిగొండ : మండలంలోని అరూరు గ్రామానికి చెందిన లోతుకుంట మణిచరణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం వాకిటి అనంతరెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బుర్ర నరసింహ, సుక్క ముత్యాలు, కొడితల కరుణాకర్, దామెర అంజయ్య, జకిడి నర్సిరెడ్డి, కొప్పుల బాలరాజు, శ్రీశైలం, మహేష్, తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు నోముల యాదగిరి తల్లి అమరావతి బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ మృతదేహంపై పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదేశాల మేరకు వారు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, డైరెక్టర్ నోముల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సింహచారి, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశంగౌడ్ ఉన్నారు.

భువనగిరి రూరల్ : మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన బిట్కూరి లక్ష్మమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట దేవునూరి బాలయ్య, సోమన బాలయ్య, బిట్కూరి మహేస్, బిట్కూరి మల్లేశ్, బిట్కూరి బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

పోరాటాల ఫలితంగానే విద్యుత్ సంస్కరణల నిలిపివేత



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో 2000సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటంలో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాణత్యాగాలు చేసిన ఫలితంగానే నేడు విద్యుత్ సంస్కరణలు నిలిచిపోయాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవరిస్తూ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నాడు ప్రజల నడ్డివిరిచే విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి ప్రజల మీద అనేక భారాలను మోపాలని చూస్తుందని అన్నారు. నేడు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనకర విధానాలను, పథకాలను పక్కకు పెట్టి ఆలోచన అవగాహన లేని పరిపాలన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగం సంస్థలను ప్రైవేట్ పరం చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం వెంకటేష్, నాయకులు ఎండీ సలీం, వల్లభుదాసు రాంబాబు, నరేష్, కిరణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి



సభ్యత్వం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఆత్మకూరు(ఎం) : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని వెంటనే ఫిట్‌మెంట్ ప్రకటించాలని, జులై 2023నుంచి పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానంలో వలంటీర్లచే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మిరియాల దామోదర్, సాంస్కృతిక కమిటీ విభాగం జిల్లా కన్వీనర్ కట్టా రమేష్, మండల అధ్యక్షుడు దర్శనం వెంకన్న, ప్రధాన కార్యదర్శి జూకంటి కరుణాకర్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతోనే బీజేపీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

మోత్కూరు : ప్రతి బూత్ స్థాయిలో భారీ సభ్యత్వ నమోదు చేపట్టడంతోనే బీజేపీ బలోపేతానికి దోహదపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. బుధవారం పట్టణంలో పార్టీ బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సభ్యత్వ నమోదు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అత్యధికంగా సభ్యత్వం కలిగి ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ప్రతి బూత్‌లో అత్యధిక స్థాయిలో సభ్యత్వ నమోదు చేయించి మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, నియోజకవర్గ కోకన్వీనర్ కూరాకుల వెంకన్న, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు పోచం సోమయ్య, జిల్లా నాయకులు ఏనుగు జితేందర్‌రెడ్డి, చాడ మంజుల, యేశబోయిన రమణ, సోమేశ్వరి, ముత్తినేని తిరుమలేష్, కందుకూరి ప్రకాష్, జినుకల దశరథ, ఎడ్ల రాము, మధుసూదన్, యాకేష్, మత్స్యగిరి, మధు, యాదగిరి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తుల ఫిర్యాదు



డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

అడ్డగూడూరు : మండలంలోని కొండంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ స్వామిపై పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఆ గ్రామస్తులు బుధవారం (డీఎల్‌పీఓ) డివిజినల్ పంచాయతీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ కార్యదర్శి స్వామి విధులకు సక్రమంగా రావడంలేదని, గ్రామపంచాయతీ నిధుల నుంచి దోమల నివారణకు ఫాగింగ్ మిషన్ కొనుగోలుకు 20-07-2024న రూ.50వేలు, 24-07-2024న మరో రూ.50వేలు, 27-07-2024న రూ.29వేలు మొత్తం రూ.లక్షా29వేలు డ్రా చేశారని, కాని ఫాగింగ్ మిషన్ కొనుగోలు చేయలేదన్నారు. అందే విధంగా గ్రామంలో ఉన్న వాటర్‌ప్లాంట్‌కు సంబంధించిన రూ.30వేలు లెక్కలు చూపించడంలేదని, వీధిదీపాల మరమ్మతులకని రూ.15వేలు ఇలా సుమారు రూ.2లక్షలకుపైగా నిధులు దుర్వినియోగం చేశాడని, కార్యదర్శి స్వామిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు ఇటికాల కుమారస్వామి, ఎం.శ్రీను, ఎం.సురేష్, కె.ప్రశాంత్, ఎం. హలియమ్మ, కె.యాదయ్య, లక్ష్మమ్మ, యాదగిరి ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



స్టేట్‌ర్యాంక్ సాధించిన హర్షసాయికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మల్లికార్జున్

రామన్నపేట : ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ ప్రకటించిన 2023–24విద్యా సంవత్సరం ఫలితాల్లో వివేకానంద హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ తిరుగుల మమత మల్లికార్జున్ తెలిపారు. బుధవారం స్థానికంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 4వ తరగతికి చెందిన పున్న హర్షసాయి రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంక్‌తో పాటు ఏడాదికి రూ.700ల ఉపకార వేతనం పొందనున్నట్లు, రెండో తరగతి చెందిన గంగాపురం అజిత్ 21వ ర్యాంక్, 1వ తరగతికి చెందిన చెన్నోజు ప్రణవి, 3వ తరగతి చెందిన కన్నెబోయిన అఖిల, 4వ తరగతి చెందిన రెముడాల హారిక స్వర్ణపతకాలు, 1వ, తరగతికి చెందిన గోగు హర్షిత, 3వ తరగతికి చెందిన మాండ్ర యశస్విని, రజత పతకాలు, 1వ తరగతికి చెందిన కూనూరు మహోన్నత్, మూడోతరగతికి చెందిన సాల్వేరు సాయిలక్ష్మి, సాధన కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు వెలిమినేటి మల్లేష్, అస్మ, సునీత, ముత్యాలు, ముబీన్, మహేష్, వెంకట్, కాంబ్లీ, విజయ, సుధారాణి, శాంతి, భార్గవి, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపేట : మండలంలోని బేగంపేట వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఉపేందర్ బుధవారం తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

చౌటుప్పల్ రూరల్ : రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పంతంగి, నేలపట్ల గ్రామాల్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ చేయడంతో ప్రతిక్షాలకు భయం పట్టుకుందన్నారు. అర్హులైన వారందరికీ రుణమాఫీ అవుతుందని అన్నారు. రైతులు ఎవరు అధైర్య పడొద్దన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు పబ్బు రాజుగౌడ్, గుండు మల్లయ్య, వెల్గ రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, నాయకులు ఉన్నారు.

చెక్కు అందజేత

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుసిగంపల నర్సింహ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సిపార్సు మేరకు మంజూరైన రూ.1.40లక్షల ఎల్‌ఓసీ చెక్కును బుధవారం గ్రామ కాంగ్రెస్ నాయకుడు బొమ్మని సాయి బాధితుడికి అందజేశారు.